సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



బ్రహ్మంగారిమఠం.. అభివృద్ధి పథం

బ్రహ్మంగారిమఠంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. క్షేత్రం దక్షిణ ద్వారంలో రాజగోపురాన్ని నిర్మించారు. -IIలో..



చిత్తూరు, అనంత జట్ల జయకేతనం

కడపలో జరుగుతున్న ఏసీఏ-సౌత్‌జోన్ సీనియర్స్ టీ-20 క్రికెట్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. -IIలో..



నయనానందకరం.. చెన్నకేశవుని చందనోత్సవం

పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు చందనోత్సవం నిర్వహించారు. -IIలో..

న్యూస్‌రీల్

వేళాంగిణికి ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్: వేళాంగిణికి మైదుకూరు డిపో నుంచి మే 5, 12వ తేదీల్లో ప్రత్యేక బస్సు సర్వీసును నడపనున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ బస్సు మైదుకూరులో రాత్రి 7 గంటలకు బయలుదేరి కడప, నాగూరు, నాగపట్నం మీదుగా వెళుతుందన్నారు. మరుసటి రోజు ఉదయం ఎనిమిందిటికి నాగూరుకు, 10 గంటలకు వేళాంగిణికి చేరుతుందన్నారు. తిరిగి ఆదివారం ఉ దయం 11కు వేళాంగిణి నుంచి బయలుదేరి సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు కడపకు, 5 గంటలకు మైదుకూరుకు చేరుతుందన్నారు. ఈ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు.

24న మెగా జాబ్‌మేళా

కడప కార్పొరేషన్: కొప్పర్తి పారిశ్రామిక వాడలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ ఏబిఎల్ డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్‌లో పని చేసేందుకు ఆసక్తిగల మహిళలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కడప శివార్లలోని సీకే దిన్నె మండలం కృష్ణాపురం రోడ్డులో ఉన్న స్విస్ట్ కళాశాలో ఈనెల 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

అర్హులకు రైతు భరోసా అవకాశం

కడప అగ్రికల్చర్: రైతు భరోసా కింద అర్హులకు తప్పక అవకాశం లభిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రైతుభరోసా వచ్చే రైతులకు ఈ ఏడాది కూడా వస్తుందన్నారు. గతేడాది సొమ్ము తీసుకున్న అనంతరం రైతు మృతి చెందడం, భూములు అమ్ముకోవడం లాంటివి చేసి ఉంటే మండల వ్యవసాయ అధికారి లాగిన్‌లో పేమెంట్ నిలిపివేయాలన్నారు.మృతి చెందిన రైతుల స్థానంలో వారి భార్య పేర్లు మాత్రమే నామినీగా ఉండాలన్నారు. ఒక వేళ సదరు రైతుకు వారసులంటే వారి పేరు మ్యూటేషన్ అయి వెబ్‌ల్యాండ్‌లో వారి పేరున ఉండాలన్నారు. నిజమైన అర్హులు మండల వ్యవసాయ అధికారి లాగిన్‌లో గానీ, తహసీల్దార్ లాగినల్‌లో గానీ రిజెక్ట్ అయి ఉంటే వారి ఆధార్ నంబర్లను తెలియచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి: ఆర్జేడీ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పాఠశాల విద్య ఆర్‌జేడీ మార్తల వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కడపలోని ఆర్‌జేడీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేయడంతోపాటు ప్రభుత్వ పథకాలు విద్యార్థులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కందిమల్లాయపల్లె చేరుకున్న వీరబ్రహ్మేంద్రస్వామి రథం



బ్రహ్మంగారిమఠం పురవీధుల్లో తిరుగుతున్న రథం

బ్రహ్మంగారిమఠం: మండలంలో దాదాపు 40 రోజులుగా ప్రతి గ్రామంలో తిరుగుతున్న మాతా గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి రథం శనివారం కందిమల్లాయపల్లె(బ్రహ్మంగారి మఠం)కు చేరుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తోట్లపల్లె అచలానందస్వామి ఆశ్రమం పీఠాధిపతి శ్రీ విరజానంద స్వామి ఆధ్వర్యంలో దాదాపు రూ.5 లక్షలతో వాహన రథం ఏర్పాటు చేయించారు. వీరబ్రహ్మేంద్రస్వామి గురించి సమీప గ్రామాల ప్రజలు మరువకూడదని, వారిని మేల్కొలిపేందుకు ఈ రథయాత్ర తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం నుంచి తోట్లపల్లెలో ప్రారంభించారు. మండలంలోని దాదాపు 56 గ్రామాలలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు చేశారు. ఈ నెల 29న తోట్లపల్లె అచలానంద ఆశ్రమంలో బ్రహ్మంగారి వచనలు, సంఘ సంస్కర్త అనే అంశంపై భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు.

శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



కడపలోని బిల్టప్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



పండుగ సందేశం ఇస్తున్న ముఫ్తీ న్యామతుల్లా సాహెబ్



రాష్ట్రమంతా సుభిక్షంగా ఉండాలి

- ముఫ్తీ న్యామతుల్లా సాహెబ్
- భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు

కడప కల్చరల్: ప్రశాంతమైన వదనాలు..చిరునవ్వులతో పలకరింపులు.. భక్తులందిరిలోనూ ఆధ్యాత్మిక భావనలు..,అందరూ ఏకేశ్వరుడైన అల్లాహ్ గురించే 'తక్బీర్' చెబుతున్నారు. అల్లాహ్‌పైన గల అచంచల విశ్వాసాన్ని నిరూపించుకునేందుకు తహతహలాడారు. మనసునిండా అల్లాహ్ బోధనలే. మనసును ఉల్లాస పరిచే అత్తరు పరిమళాలు. ఆత్మీయతకు ప్రతిరూపంగా ఆలింగనాలు. పవిత్రమైన రంజాన్ (ఈదుల్ ఫితర్) పండుగను శనివారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు మధ్యాహ్నం 12.30 గంటల వరకు సాగాయి. కొందరు మసీదుల్లో ప్రార్థనలు చేయగా, ఎక్కువ మంది సమీపంలోని ఈద్గాలలో సామూహికంగా ప్రార్థనలు నిర్వహించారు.



బిల్టప్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, పెద్దదర్గా పీఠాధిపతి తదితరులు

కడప నగరం బిల్టప్ ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మత గురువులు ముఫ్తీ న్యామతుల్లా పండుగ సందేశాన్ని అందజేశారు. అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకునేందుకు నమాజే ఏకైక మార్గమని పేర్కొన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా రంజాన్‌మాసం అనంతరం కూడా నమాజ్ ప్రార్థనలను వీడబోమన్నారు. దేవుని కృప కటాక్షాలకు నమాజ్‌కు మించి మార్గం లేదన్నారు. విలువైన మానవజన్మ ఇచ్చినందుకు జీవితాంతం ప్రార్థనలతో కృతజ్ఞతలు తెలుపుకుంటామన్నారు. జిల్లా వాసి పాలకుడిగా ఉండడం జిల్లా వాసులకు ప్రత్యేక ఆనందం ఇస్తోందని, ప్రభుత్వం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ప్రజా సంక్షేమ దిశగా పాలన సాగించాలని కోరుతున్నామన్నారు. ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. రాష్ట్రమంతటా సుభిక్షింగా ఉండాలని, కరువు కాటకాలు రాకూడదని ఆకాంక్షిస్తున్నామన్నారు. అనంతరం కడప పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా ఆరీపుల్లా హుస్సేనీ సాహెబ్ ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు సాగాయి. ప్రపంచమంతటా శాంతియుతంగా ఉండేలా కరుణించాలని, దేశం, రాష్ట్రం, మన జిల్లా సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా పెద్ద దర్గా పీఠాధిపతి ఆశీస్సులు అందుకునేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. ప్రాంగణంలో ముస్లిం సోదరులు సంతోషంతో ఒకరినొకరు హత్తుకుని 'ఈద్ ముబారక్' చెప్పుకున్నారు.

ఘనంగా ఏర్పాట్లు: జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈద్గాలో రంజాన్ ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉండడం, ట్రాఫిక్‌ను ముందే మళ్లించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగలేదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజద్‌బాషా, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, నగర ముస్లిం ప్రముఖులు నజీర్ అహ్మద్, డాక్టర్ సొహైల్, సయ్యద్ సలావుద్దీన్, అమీర్‌బాబు, ఆర్. శ్రీనివాసులరెడ్డి, జిలానీబాష, సుభాన్‌బాష, షఫీ, నాసర్ అలీ, దర్గా ప్రతినిధులు మున్నా, అమీర్‌తో పాటు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

దివ్య గుణాల పరిమళమే ఈద్-ఉల్ ఫితర్

కడప కల్చరల్: దేవునిపై భక్తి, శాంతి సమైక్యత, సోదర స్నేహ భావాలు ధాన గుణంలాంటి మంచి అలవాట్ల పరిమళమే రంజాన్ పర్వదినమని ఉపముఖ్యమంత్రి అంజద్‌బాషా సందేశమిచ్చారు. రంజాన్ సందర్భంగా శనివారం స్థానిక బిల్టప్ వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలకు హాజరైన ఆయన మాట్లాడుతూ మన పాపాలను దూరం చేసుకొనే అవకాశం ఈ మాసంలో లభిస్తుందన్నారు. సృష్టి అంతా దైవం ఇచ్చినదేనని, కానీ అంతా మనదేనన్న అజ్ఞానంలో మానవుడు జీవిస్తున్నాడన్నారు. మనుషుల్లో ప్రేమ సోదర భావం, మానవత్వం లాంటి గుణాలు పెంచడమే రంజాన్ ఉపవాసాల ఉద్దేశం అన్నారు. ప్రపంచమంతా శాంతి నెలకొనాలని, మన జిల్లా, రాష్ట్రం, దేశం సుభిక్షింగా ఉండాలని వాన్ని ప్రార్థించామని తెలిపారు.

పకడ్బందీగా 'పది' మూల్యాంకనం

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనాన్ని పూర్తిస్థాయి భద్రత మధ్య పకడ్బందీగా నిర్వహించాలని పది పరీక్షల అబ్జర్వర్ మర్తాల వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని వసతులు, మూల్యాంకనం చేసే తీరును పరిశీలించారు. సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. జవాబు పత్రాల మూల్యాంకనంలో తప్పదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని డీఈఓ రాఘవరెడ్డిని ఆదేశించారు. మూల్యాంకనం అనంతరం మార్కుల కౌటింగ్‌ను జాగ్రత్తగా చేపట్టాలన్నారు.. మార్కుల విషయంలో ఏ విద్యార్థికి అన్యాయం జరగకూడదన్నారు.సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూల్యాంకనాన్ని ఈనెల 26వ తేదీ నాటికి పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. మూల్యాంకనానికి వచ్చే సిబ్బంది గుర్తింపుకార్డుతో రావాలన్నారు.సెల్ ఫోన్లు వినియోగించరాదని ఆదేశించారు.సమష్టి కృషితో సకాలంలో మూల్యాంకనాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాఘవరెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



మూల్యాంకన కేంద్రంలో సమాధాన పత్రాలను పరిశీలిస్తున్న పది పరీక్షల అబ్జర్వర్ వెంకటకృష్ణారెడ్డి

నేడు పుష్పగిరిలో బండలాగుడు పోటీలు

వల్లూరు: పుష్పగిరి శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అక్షయ తదియను పురస్కరించుకుని ఆదివారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు జరగనున్నాయి. భారతి సిమెంట్ పరిశ్రమ సౌజన్యంతో ఫ్లడ్ లైట్ల వెలుగులో అఖిల భారత ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శనలో ఓల్డ్ కేటగిరీ వృషభ రాజములతో పోటీలు నిర్వహించనున్నట్లు బండలాగుడు పోటీల కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ 60 ,116 లను ఎం.నరేందర్ రెడ్డి, ఎం. మహేంద్రారెడ్డి (ఎంఆర్ హోండా ప్రొద్దుటూరు), ద్వితీయ బహుమతి రూ 50 ,116 లను తోట ప్రభాకర్ (ఐగ్రో వర్చువల్ ఐటీ సొల్యూషన్స్ ప్రై లిమిటెడ్, హైదరాబాద్), తృతీయ బహుమతి రూ 40 ,116 బలుసా చంద్ర (శ్రీనివాస ప్లైవుడ్, కడప), నాలుగో బహుమతి రూ 30, 116 ,ఐదో బహుమతి రూ 20 ,116 లను భారతి సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్, నల్లింగాయపల్లె, ఆరో బహుమతి రూ 12 ,116 లను గోటూరుకు చెందిన పాన్నోలు శివ కుమార్ రెడ్డి , ఏడో బహుమతి రూ 8, 116 లను సంతకొవ్వూరుకు చెందిన బండి లక్ష్మిరెడ్డి విరాళంగా అందచేస్తున్నారని తెలిపారు. ఇవి కాకుండా పోటీలో పాల్గొని గెలుపొందని మిగిలిన ప్రతి కాడి ఎద్దులకు ఒక్కో కాడికి రూ 4 వేల చొప్పున కన్సోలేషన్ బహుమతులను భారతి సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్, నల్లింగాయపల్లె వారు ఇవ్వనున్నారని నిర్వాహకులు తెలిపారు.



పుష్పగిరిలో రాష్ట్ర స్థాయి బండ లాగుడు పోటీల కోసం సిద్ధం చేసిన మైదానం

క్రికెట్ గ్యారేజ్

- నందలూరు సబ్‌సెంటర్‌లో యువ క్రీడాకారులకు శిక్షణ
- జిల్లా,జోన్, రాష్ట్రస్థాయిలో రాణింపు

రాజంపేట: పెద్దపెద్దనగరాల్లో ఉన్న స్టేడియంలో క్రికెట్ నెట్‌ప్రాక్టీస్, వివిధ స్థాయిల్లో జరుగుతుంటాయి. ఇది కామన్.. క్రికెట్‌క్రేజ్ పెరిగి పల్లె ప్రాంతం నుంచి యువతీ, యువకులు క్రికెట్ క్రీడలో రాణిస్తున్నారు. ఇందుకు నిదర్శనమే నందలూరు జిల్లా పరిషత్ క్రీడామైదానం. ఇప్పుడు అదొక విలేజ్ క్రికెటర్స్ కర్మాగారంగా మారిపోయింది. వందలోపు క్రికెటర్లు క్రికెట్ పోటీల్లో ప్రతిభను చాటుతున్నారు. దీంతో నందలూరు సీఏవైడీ సబ్‌సెంటర్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది.ఇప్పుడు నందలూరు క్రికెట్ క్రీడా గడ్డగా భాసిల్లుతోంది.

సిమెంట్ పిచ్ ఏర్పాటు

క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్(సీఏవైడీ) ఇక్కడున్న యువకుల్లో క్రికెట్‌పై కనిపిస్తున్న ఆసక్తిని గుర్తించి సబ్‌సెంటర్‌ను ఏర్పాటుచేసింది. ఇక్కడ నెట్‌ప్రాక్టీస్ చేసుకునే సౌకర్యం కల్పించింది. హెడ్ కోచ్‌గా సయ్యద్‌ఘయాజ్, అసిస్టెంట్‌గా ఫిరోజ్‌కాన్‌లోడి, ట్రైనర్ జాతీయస్థాయి దివ్యాంగ క్రికెటర్ శివకోటిలను నియమించింది. తాజాగా సిమెంట్ పిచ్‌ను కూడా అదనంగా ఏర్పాటు చేశారు. మైదానంలో వీరితో క్రికెట్ శిక్షణ తొమ్మిదేళ్లగా కొనసాగింది. ఫలితంగా ఎందరో యువ క్రికెటర్లు పుట్టుకొచ్చారు. ఒక్క నందలూరు సబ్‌సెంటర్‌నుంచే అనేక మంది రాష్ట్ర, జోనల్ స్థాయిలో ప్రతిభను కనబరిచారు. అండర్-12, 14, 16, 18 స్థాయిలో జిల్లా జట్టుకు ఎంపికవుతూ వస్తున్నారు.



నందలూరు సీఏవైడీ సబ్‌సెంటర్‌లో క్రికెట్ శిక్షణ పొందుతున్న బాలికలు

సమ్మర్ క్యాంపునకు విశేషస్పందన

సీఏవైడీ ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మర్ క్యాంపునకు విశేషస్పందన లభిస్తోంది. సెలవులు కావడంతో పల్లెల నుంచి కూడా యువకులు క్రికెట్ శిక్షణ పొందడానికి వస్తుంటారు. వ్యాయామపరంగా పిట్‌గా ఉండటమే కాకుండా, క్రికెట్‌లో రాణించేందుకు అవసరమైన మెలకువలను కోచ్‌లు శిక్షణ ఇస్తుంటారు.

రాణిస్తున్న క్రీడాకారులు

పేరుకు జిల్లాపరిషత్ క్రీడామైదానం. అయితే దశాబ్దాల కాలం నుంచి ఈ మైదానంలో ఎందరో వాలీబాల్, ఫుట్‌బాల్, ఖోఖో,కబడ్డీలాంటి క్రీడల్లో ఈ ప్రాంతానికి చెందిన వారు చాలామంది రాణించారు. క్రికెట్‌లో రంజీ స్థాయి వరకు వెళ్లిన క్రీడాకారులు ఉన్నారు. ఇప్పుడు సీడీవైఏ సబ్‌సెంటర్‌తో మినీ క్రికెట్‌స్టేడియంగా మారిపోయింది. ఉన్న వసతులతోనే క్రికెటర్లు ఇక్కడి నుంచి పుట్టుకొస్తున్నారు. నందలూరు జిల్లాపరిషత్ క్రీడామైదానాన్ని వైఎస్సార్ మినీ క్రికెట్‌స్టేడియంగా మార్చాలని క్రి కెట్ అభిమానులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



నా పేరు ఆదిల్ హుసేన్. కడపలో డిగ్రీ చదువుతన్నా. అండర్-14, అండర్-16లో క్రికెట్ ఆడా. సీఏవైడీ సబ్‌సెంటర్ నుంచే క్రికెట్‌లో శిక్షణ పొందా. ఉన్న సౌకర్యాలతో క్రికెట్‌లో మెలకువలను నేర్చుకున్నా. ఇప్పుడు అండర్-19కు రాష్ట్రస్థాయి పోటీలకు ఆడుతున్నా. సీనియర్ జట్టుకు స్టాండ్‌బైలో ఉన్నాను.



నా పేరు జాఫర్‌అలీఖాన్, మాది నందలూరు గ్రామం. నందలూరు క్రీడామైదానంలో సీఏవైడీ సబ్‌సెంటర్‌లో క్రికెట్ ఆటను నేర్చుకున్నా. కోచ్, తల్లితండ్రుల ప్రోత్సహంతో అండర్ - 14, 16, 19లో వివిధ స్థాయి క్రికెట్‌పోటీల్లో రాణించగలిగా. నందలూరు నుంచి ఇప్పుడు ఎంతో మంది యువతీ,యువకులు క్రికెట్‌లో రాణించేందుకు పోటీ పడుతున్నారు.మండలస్థాయిలోని మైదానంలో శిక్షణ పొంది క్రికెట్‌లో రాణించడం సంతోషంగా ఉంది.



నా పేరు కెఎంఎస్ ఆచారి, నాగిరెడ్డిపల్లె గ్రామం. మా నాన్న సర్వేశ్వరాచారి, రైల్వే ఉద్యోగి. తల్లితండ్రుల ప్రోత్సాహమే కాకుండా సబ్‌సెంటర్ కోచ్‌లు ఇచ్చే శిక్షణ తాను క్రికెట్‌లో రాణించేందుకు దోహదపడింది. అండర్ - 14, 16, 19 నుంచి సీనియర్ జిల్లా జట్టులో ఆడాను. జోన్, రాష్ట్ర స్థాయి జట్లలో పాల్గొనే అవకాశం లభించింది. ఎంతోమంది క్రికెటర్లను తయారుచేస్తున్న నందలూరు గ్రౌండ్ మినీ క్రికెట్‌స్టేడియంగా మార్చే దిశగా ప్రభుత్వం దృష్టి సారించాలి.

క్లుప్తంగా

అరటి పంటకు తీవ్ర నష్టం

కాశినాయన : మండలంలో శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు 150 ఎకరాల్లో అరటి పంట నష్టం వాటిల్లిందని ఉద్యానవన అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పగడాలపల్లె, ఇటికులపాడు, కోడిగుడ్లపాడు, కొనరాజుపల్లె, కేఎస్ కొట్టాల, ఆకులనాయునిపల్లె గ్రామాల్లో సాగు చేసిన అరటి పంట దెబ్బతినిందని ప్రాథమిక అంచనా వేశామన్నారు. సోమవారం పంటను పరిశీలించి తగు చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.

ఉపాధ్యాయునిపై పోక్సో కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఓ బాలిక(12) పట్ల అతను అసభ్యంగా ప్రవర్తించడమే గాక, మాయమాటలు చెప్పి ఆమెతోపాటు ఫొటోలను తన సెల్‌ఫోన్‌లో తీసుకున్నాడు. ఈ సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేసి, నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

తలనీలాల ద్వారా రూ.1.10 కోట్ల ఆదాయం



టెండర్ బాక్స్ ఓపెన్ చేస్తున్న అధికారులు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో భక్తులు సమర్పించే తలనీలాల ద్వారా ఆలయానికి రూ.కోటి పది లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. తలనీలాలను ఏడాది కాలం పాటు పోగు చేసుకునే నిమిత్తం ఆలయ కార్యాలయంలో శనివారం టెండర్లు నిర్వహించారు. పలు జిల్లాల నుంచి 12 మందికి పైగా పోటీ పడ్డారు. హెచ్చు పాటదారుడు అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ అధినేత శ్రీనివాసులు దక్కించుకున్నాడు. గతేడాది కంటే ఈ సారి రూ.52,24,340 అధికంగా ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ కడప కార్యాలయ ఇన్‌స్పెక్టర్ జనార్ధన, ఆలయ చైర్మన్ పినుపోలు రాఘవేంద్రప్రసాద్, ఆర్కేవ్యాలీ ఎస్సై రంగారావు, ఆలయ అర్చకుడు రాజారమేష్, చక్రాయపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విఫలమైన పైరవీలు

తక్కువ మొత్తానికి దక్కించుకునేందుకు కొందరు చేసిన పైరవీలు ఏమాత్రం ఫలించలేదు. టెండర్లలో ఈ ప్రాక్యూర్‌మెంట్, సీల్డ్ టెండరు, బహిరంగ వేలం పెట్టి.. అందులో హెచ్చు మొత్తం ఎవరిది ఉంటుందో వారికే హక్కు కల్పించడంతో సిండికేట్‌దారుల ప్రయత్నాలు విఫలమయ్యాయి.

బ్రహ్మంగారిమఠం.. అభివృద్ధి పథం

- ఊపందుకున్న పనులు
- భారీగా నిధుల కేటాయింపు
- భక్తులకు సమకూరనున్న సౌకర్యాలు

బ్రహ్మంగారిమఠం : శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి గొప్ప కాలజ్ఞాని, సంఘ సంస్కర్త, తత్త్వవేత్త, రాజయోగి, ఆధ్యాత్మికవేత్త, మహిమాన్వితుడిగా ఈ భూ మండలంపై కీర్తి గడించారు. ఆయన సజీవ సమాధి నిష్ట పొందిన ప్రదేశం బ్రహ్మంగారిమఠం. కావున ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెంది ఉండాల్సింది. అయితే ఎన్నో కారణాల వల్ల ప్రగతిలో వెనుకబడి ఉంది. దీంతో దేశ, విదేశాల నుంచి ఎంతో ఇష్టంతో వచ్చే భక్తులు.. నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారు. స్వామి సజీవ సమాధిని దర్శించుకుని ఇంటి ముఖం పడుతున్నారు. వాస్తవానికి బ్రహ్మంగారిమఠంలో ఎన్నో దర్శనీయ, విశిష్ట స్థలాలు ఉన్నాయి. అయితే అవి కనీస వసతులకు నోచుకోకపోవడంతో.. చాలా మంది దర్శించుకోకుండానే వెళ్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొంత కాలం నుంచి అభివృద్ధి జాడ కనిపిస్తోంది. దర్శనీయ స్థలాల్లో కొంత మార్పు గోచరిస్తోంది. కావున భక్తులు దర్శించుకుని, తరించి.. కొంచెం సంతృప్తి పొందవచ్చు. ఈ నెల 27 నుంచి మే 2 వరకు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బ్రహ్మంగారిమఠంలో జరిగిన అభివృద్ధిపై అందిస్తున్న ప్రత్యేక కథనం.

రమణీయంగా రాజగోపురం

వీరబ్రహ్మేంద్రస్వామి మఠం 7 ఎకరాల 18 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. క్షేత్రం దక్షిణ ద్వారంలో ఐదు అంతస్తుల రాజగోపురాన్ని రమణీయంగా నిర్మించారు. ఉత్తర ద్వారం ఏర్పాటు చేశారు. గర్భాలయంలో గోడలకు గ్రానైట్.. ద్వారం, ఇరుపక్కల వెండి తొడుపు నిర్మాణం చేపట్టారు. స్వామి సజీవ సమాధికి వెండి తొడుపు, వెండి మకరతోరణం నిర్మించారు. కాలజ్ఞాన తాళపత్రాలకు వెండిపెట్టెలు ఏర్పాటు చేశారు. శ్రీ పోతులూరయ్యస్వామి, పార్వతమ్మ, గోవిందమాంబ సమాధులకు ఇత్తడితో రుద్రాక్ష మండపం నిర్మించారు. ప్రధాన ఆలయంలో గోడలు, ఫ్లోరింగ్‌కు గ్రానైట్ ఏర్పాటు, స్తంభాలకు ఇత్తడి తొడుగు ఏర్పాటు చేశారు. భక్తుల విడిది కోసం వీరగురు, గోవిందమాంబ సదనంలు నిర్మించారు. శాశ్వత నిత్య అన్నదాన పథకం నిర్వహిస్తున్నారు. ఇందుకోసం డైనింగ్ హాల్ నిర్మించారు. మఠం పార్కులో టూరిజం వారిచే పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో రూ.కోటి 68 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. స్వామి 21 అడుగుల విగ్రహాన్ని శోభాయమానంగా ఏర్పాటు చేశారు. శివాలయం, కల్యాణ మండపం, అలంకార మండపం, మహానివేదన మందిరం, బ్రహ్మరథం, టీటీడీ సత్రం పునరుద్ధరించారు. బ్రహ్మరథానికి రథశాల, క్యూకాంప్లెక్స్, మఠం పక్కన ఉన్న వంకకు కాజ్‌వే నిర్మించారు. ఆలయ ప్రాంగణాన్ని గ్రానైట్ బండపరుపుతో తీర్చిదిద్దారు. గణపతి విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ పనులన్నీ మఠాధిపతుల ఆధ్వర్యంలో జరిగాయి. సుదీర్ఘ కాలం మఠాధిపతిగా ఉన్న శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి నేతృత్వంలో ఎక్కువగా చేపట్టారు.



దేవాలయ దక్షిణ ద్వారం రాజగోపురం



శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి నివాసం ప్రాకారం గోడ

ప్రాకారం నిర్మించేందుకు కసరత్తు

మఠం ఫిట్‌పర్సన్‌గా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సి.శంకర్‌బాలాజీ బాధ్యతలు చేపట్టిన తర్వాత అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఇందుకోసం భారీగా నిధులు కేటాయించారు. అప్పటికే జరుగుతున్న పనులను పూర్తి చేయడంతోపాటు కొత్త వాటికి శ్రీకారం చుట్టారు. స్వామి నివాస గృహ ప్రాకారం గోడ, రాజగోపురాన్ని రూ.29 లక్షల 50 వేలతో నిర్మించారు. మఠం ఆవరణలోని టీటీడీ అతిథి గృహం సమీపంలో రూ.20 లక్షల 55 వేలతో కల్యాణ కట్ట నిర్మాణ పనులు చేస్తున్నారు. రూ.65 లక్షల 25 వేలతో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. వీవీపీల కోసం అతిథి గృహాన్ని రూ.15 లక్షల 39 వేలతో నిర్మిస్తున్నారు. గోకులంను రూ.15 లక్షల 98 వేలతో చేపడుతున్నారు. భక్తుల విశ్రాంతి కోసం డార్మెంటరీ హాల్‌ను రూ.50 లక్షల 62 వేలతో నిర్మిస్తున్నారు. ఆలయ ఉత్తరం వైపు ఫ్లోరింగ్ కోసం రూ.34 లక్షల 50 వేలు వెచ్చించారు. ధ్వజస్తంభాన్ని అట్టహాసంగా పునఃప్రతిష్ఠించారు. వంక సుందరీకరణ పనులు రూ.34 లక్షలతో చేపడుతున్నారు. శాశ్వత విద్యుద్దీకరణ పనులు చేపట్టేందుకు హైమాస్ లైటింగ్ కోసం రూ.44 లక్షలు కేటాయించారు. రక్షణ గోడ వెనుక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించనున్నారు. తిరుపతి, శ్రీశైలం దేవస్థానాల వలే మఠం చుట్టూ పెద్ద రాళ్లతో ప్రాకారం నిర్మించేందుకు కసరత్తు జరుగుతోంది. ఇందుకోసం రూ.2 కోట్ల 5 లక్షల నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

పోలేరమ్మ దేవస్థానంలో..



శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠం పరిధిలోని పోలేరమ్మ దేవస్థానాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మండపం, ప్రాకారం గోడ నిర్మాణాన్ని రూ.89 లక్షల 50 వేలతో పూర్తి చేశారు. ఆవరణలో వంటశాల, డైనింగ్ హాల్ నిర్మాణాన్ని రూ.15 లక్షల 69 వేలతో చేపడుతున్నారు. ఆలయ ముఖద్వారాన్ని రూ.7 లక్షల 27 వేలతో నిర్మిస్తున్నారు. రూ.21 లక్షల 26 వేలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేస్తున్నారు. రూ.57 లక్షల 72 వేలతో రక్షణ గోడ నిర్మిస్తున్నారు. రూ. 72 లక్షలతో డార్మెంటరీ హాల్ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపారు. ఈ పనులన్నీ పూర్తయితే భక్తులకు సౌకర్యాలు సమకూరుతాయి.

ప్రగతికి కృషి



3 శతాబ్దాలకు పైగా చరిత్ర ఉన్న మఠం ఎంతో అభివృద్ధి చెంది ఉండాల్సింది. పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి ఆధ్వర్యంలో భారీగా ప్రగతి పనులు చేపట్టారు. ఇప్పటికీ జరుగుతున్నాయి. మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మఠం అభివృద్ధి కోసం శక్తి మేరకు కృషి చేస్తున్నాను.

- ఎన్.ఈశ్వరయ్య ఆచారి, మేనేజర్, బ్రహ్మంగారిమఠం

నిరంతర పర్యవేక్షణ



ఆన్‌లైన్ టెండర్ల ద్వారా పనులు చేపడుతున్నాం. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. దేవాలయాన్ని అభివృద్ధి చేయాలనే తపనతో పని చేస్తున్నాం. దాతలు, భక్తులు సహకరించాలి.

-సి.శంకర్‌బాలాజి, ఫిట్‌పర్సన్, బ్రహ్మంగారిమఠం

పులివెందుల సబ్‌రిజిస్ట్రార్‌పై మరో చీటింగ్ కేసు

- మదనపల్లె భూములకు ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్లు
- జీపీఏలను తారుమారు చేసి ఇతరుల భూములకు రిజిస్ట్రేషన్లు

మదనపల్లె : ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ(జీపీఏ) పేరుతో భూమిని ఇతరులకు విక్రయించేందుకు సహకరించాడన్న ఆరోపణలపై పులివెందుల సబ్‌రిజిస్ట్రార్ నాసిర్, పట్టణానికి చెందిన కట్టాసులోచన, అనుచరులపై మరో చీటింగ్ కేసు హైకోర్టు ఉత్తర్వుల మేరకు నమోదైంది.

స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాలూకా సీఐ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని మార్వారి అబ్బయ్యగారి వీధికి చెందిన వెంకటేష్‌నాయుడికి మదనపల్లె మండలం పొన్నూటిపాళ్యం పంచాయతీ భువనేశ్వరినగర్‌లో 2.20 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని 2013లో కలకడ మండలం సప్తగిరినగర్‌కు చెందిన గోపీనాయుడు భార్య సునీతకు వెంకటేష్‌నాయుడు విక్రయించారు. అయితే నీరుగట్టువారిపల్లెకు చెందిన కట్టా సులోచన, ఆమె అనుచరులు ఏడాది కిందట పులివెందుల సబ్‌రిజిస్ట్రార్ ఎస్.నాసిర్‌తో కుమ్మక్కై ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్లు, జీపీఏలు చూపుతూ మదనపల్లె భూములకు పులివెందుల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో లావాదేవీలు నిర్వహించారు. భూములను ఇతరులకు విక్రయిస్తూ రికార్డులు సృష్టించారు. గుట్టుచప్పుడు కాకుండా భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి, స్వాధీనం చేసుకుని ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై బాధితులు హైకోర్టును ఆశ్రయించడంతో ఇచ్చిన ఉత్తర్వులు మేరకు చీటింగ్ కేసు నమోదైంది. ఇప్పటికే పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లలో పులివెందుల సబ్‌రిజిస్ట్రార్ నాసిర్, కట్టాసులోచనపై భూ అక్రమాలకు సంబంధించి హైకోర్టు ఉత్తర్వుల మేరకు రెండు కేసులు నమోదై దర్యాప్తులు కొనసాగుతున్నాయి. తాజాగా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదు కావడంతో మొత్తం వీరిపై మూడు కేసులు నడుస్తున్నాయి. పులివెందుల సబ్‌రిజిస్ట్రార్ నాసిర్ ఎక్కడ విధులు నిర్వహించినా ప్రతి చోట ఆయన అక్రమాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. గతంలో అనంతపురం జిల్లా కదిరిలో దేవదాయ శాఖ భూముల వ్యవహారంలోనూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొని సస్పెన్షన్‌కు గురయ్యారు. అనంతరం మదనపల్లెలో సబ్‌రిజిస్ట్రార్‌గా పని చేస్తూ ప్రభుత్వ, చుక్కల భూములకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా రిజిస్ట్రేషన్‌లు చేశారు. ప్రస్తుతం పులివెందుల సబ్‌రిజిస్ట్రార్‌గా పని చేస్తూ.. మదనపల్లెలోని భూములకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడంపై వివాదాల్లో ఇరుక్కున్నారు. పట్టణంలోని మూడు పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన కేసులకు సంబంధించి నిందితులైన కట్టాసులోచన, ఆమె అనుచరులు అరెస్ట్ భయంతో ఇతర ప్రాంతానికి వెళ్లినట్లు తెలిసింది.

నంద్యాల ఎద్దుల జయకేతనం



ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్దులు

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలి హేలాంబ తిరునాలను పురస్కరించుకుని నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్కంఠగా జరిగాయి. ఈ పోటీలు శుక్రవారం నుంచి శనివారం వరకు జరిగాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 11 జతల ఎద్దులు పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా బిల్లాలాపురానికి చెందిన భుమ్మ గోవర్ధన్‌రెడ్డి ఎద్లు అత్యధికంగా 1594 అడుగులు రాతిదూలాన్ని లాగి జయకేతనం ఎగురవేశాయి. నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన నాగయ్య ఎద్లు 1564 అడుగులతో ద్వితీయ స్థానంలో, వైఎస్సార్ జిల్లా చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుల్‌రెడ్డి ఎద్లు 1500 అడుగులతో తృతీయ స్థానం, అనంతపురం జిల్లా కృష్ణాపురానికి చెందిన నాగరాజుగౌడ్, నాగేశ్వర్‌రెడ్డి ఎద్లు 1328 అడుగులతో నాల్గవ స్థానం, నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన భరత్ కుమార్ యాదవ్ ఎద్లు 1265 అడుగులతో ఐదవ స్థానం సాధించాయి. వైఎస్సార్ జిల్లా ఆనంవారిపల్లెకు చెందిన శీలం జగన్ మోహన్‌రెడ్డి ఎద్లు 1256 అడుగులతో ఆరవ స్థానం, వైఎస్సార్ జిల్లా వెలవలికి చెందిన రసూల్ ఎద్లు 1075 అడుగులతో 7వ స్థానం, అనంతపురం జిల్లా కుందనంకోటలోని గుజ్జల చెన్నప్పకు చెందిన ఎద్లు 1012 అడుగులతో 8వ స్థానం, వైఎస్సార్ జిల్లా నారసపురానికి చెందిన కామని ప్రతాప్‌రెడ్డి ఎద్లు 1003 అడుగులతో 9వ స్థానం, నంద్యాల జిల్లా గోటిక రవితేశ్వరరెడ్డి ఎద్లు 919 అడుగులతో 10వ స్థానం, నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన మేకల వెంకటరాముడు ఎద్లు 833 అడుగులతో చివరి స్థానంలో నిలిచాయి. వారికి వరుసగా రూ.1 లక్ష, రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు నగదు బహుతులను నిర్వాహకులు అందజేశారు. ఈ పోటీలకు యాంకర్‌గా నారాయణస్వామి సేవలందించారు.

బంగారు అపహరణ

తొండూరు : పులివెందుల – ముద్దనూరు ప్రధాన రహదారిలోని మల్లేల క్రాస్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు మహిళను కత్తితో బెదిరించి.. బ్యాగ్‌లో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించారు. ముద్దనూరు మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన సుజాత అనే మహిళ శనివారం సాయంత్రం తన కుమార్తెను.. అత్త ఊరైన సింహాద్రిపురం మండలం బొజ్జాయిపల్లె గ్రామానికి తీసుకొని వస్తుండేది. దీంతో ముద్దనూరు బస్టాప్‌లో పులివెందుల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కింది. మల్లేల ఘాట్ సమీపంలోకి రాగానే బస్సు మరమ్మతులకు గురైంది. దీంతో బస్సులో ఉన్న వారంతా దిగి వేరే బస్సు ఎక్కే సమయంలో సుజాత కూడా బస్సు ఎక్కుతున్నప్పుడు ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమెను కత్తితో బెదిరించి బ్యాగ్‌ను దొంగలించారు. బ్యాగ్‌లో 5 తులాల బంగారు లాంగ్ చైన్, ఒకటిన్నర తులం బంగారు కమ్మలు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హనుమంతు తెలిపారు.

చిత్తూరు, అనంత జట్ల విజయం



మ్యాచ్ ఆడుతున్న చిత్తూరు, నెల్లూరు జట్లు

కడప స్పోర్ట్స్ : ఏసీఏ-సౌత్‌జోన్ సీనియర్స్ టీ-20 అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు జయకేతనం ఎగురవేశాయి. కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో శనివారం ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 90 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని సాకేత్‌రామ్ 21, మోహన్‌కృష్ణ 20 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్ వై.గిరీష్‌కుమార్‌రెడ్డి 4, దీపన్‌సాయినాథ 2, సూర్య 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 11.3 ఓవర్లలోనే 2 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. జట్టులోని అభిషేక్‌రెడ్డి 41, పృధ్వీరాజ్ 26 పరుగులు చేశారు. దీంతో చిత్తూరు జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

'అనంత'కు వరుసగా రెండో విజయం

మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. జట్టులోని తౌఫిక్ హుస్సేన్ 51 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు వినయ్‌కుమార్ 2, దీపక్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 14.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. జట్టులోని ఎం.కె.దత్తారెడ్డి 56 పరుగులు, యోగానంద 34 పరుగులు చేశారు. దీంతో అనంత జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

నయనానందకరం.. చెన్నకేశవుని చందనోత్సవం



చందనోత్సవ అలంకార భూషితుడైన చెన్నకేశవుడు



వైద్యనాథస్వామి పూజ కార్యక్రమంలో పీఠాధిపతి

వల్లూరు : పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వాముల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం కొండపైన గల శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు చందనోత్సవ కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చందనంతో ప్రత్యేకంగా అలంకరించారు. చందన భూషితుడై తేజోవంతంగా కనిపిస్తూ చల్లని దీవెనలందిస్తున్న స్వామిని దర్శించుకుని భక్తులు తరించారు. నయనానందకరంగా వున్న స్వామి వారి దివ్య మంగళ రూపాన్ని చూసి భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. పుష్పగిరి గ్రామంలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైద్యనాథేశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు. శ్రీ చక్ర సహిత కామాక్షీదేవి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి నెమలి వాహనంపై కొలువు దీరిన శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వాములకు పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకరభారతిస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలతో స్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ చెన్నకేశవస్వామి హనుమంత వాహనంపై కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చారు. కొండపై నుంచి స్వామి వారిని పల్లకీలో మోస్తూ మంగళవాయిద్యాలు, దివిటీల వెలుగుల మధ్య పుష్పగిరి మాడ వీధులలో ఊరేగించారు. భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఈవో మహేశ్వరరెడ్డి, పురోహితులు సుమంత్ దీక్షితులు, రాజేశ్వర శర్మ, సుబ్బయ్య స్వామి, సుబ్బారెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు.

నేడు అక్షయ తదియ ఉత్సవాలు

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం అతి ముఖ్యమైన అక్షయ తదియ తిరునాల ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు. ఉదయం చెన్నకేశవునికి పూలంగి సేవ జరుగుతుంది. రాత్రి జరిగే వైద్యనాథుడి నందివాహన సేవకు, శ్రీ చెన్న కేశవుని గరుడ వాహన సేవకు విశేష సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు. శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, వైద్యనాథస్వామి ఆలయాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువ పందిర్లు శుక్రవారం సాయంత్రం వీచిన పెనుగాలులకు కూలిపోవడంతో పునరుద్ధరించారు. పెన్నా నదిలో స్నానాల అనంతరం మహిళలు దుస్తులు మార్చుకోవడానికి తడికెలతో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేశారు. జేసీబీలు, ట్రాక్టర్లతో కొండపైన వాహనాల పార్కింగ్ స్థలాన్ని తయారు చేయించారు. గ్రామంలో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయించారు. ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, యర్రగుడిపాడు చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో బండలాగుడు పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. పుష్పగిరికి చేరుకొనే దారుల వెంట వున్న ముళ్లపొదలను జేసీబీలతో తొలగించారు. క్యూలైన్లను ఏర్పాటు చేశారు. శ్రీ వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంతోపాటు వివిధ కుల సంఘాలు, గ్రామాల వారి ఆధ్వర్యంలో అన్న దానాలు చేయడానికి ఏర్పాట్లు చేశారు.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం ॥ 23-4-2023

వైరల్

అమ్మాజీ... కదిలించావు!

ఒక సిటీలో ఒక మహిళ రోడ్డు పక్కన ఎండలో కూర్చుని బఠాణీలు అమ్ముతోంది. ఈ దృశ్యం పవన్ కౌశిక్ అనే ట్విట్టర్ యూజర్ కంట్లో పడింది. 'ఈ వయసులో ఎండలో కూర్చొని కష్టపడుతోంది' అని జాలిపడి బేరం ఆడకుండా ఆమె దగ్గర ఉన్న బఠాణీల సంచులను హోల్‌సేల్‌గా కొనేశాడు.



ఆమెతో సెల్ఫీ దిగి తన సంతోషాన్ని ట్విట్టర్‌లో షేర్ చేశాడు. 'అమ్మాజీకి సహాయపడినందుకు సంతోషంగా ఉంది' అంటూ రాశాడు.

ఈ ట్వీట్ వైరల్ కావడం మాట ఎలా ఉన్నా యూజర్స్ మాత్రం రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒక వర్గం వారు 'చాలా మంచి పనిచేశారు' అని ప్రశంసిస్తే మరో వర్గం మాత్రం 'చేసిన మంచి పని చెప్పుకోకూడదు. పబ్లిసిటీ ఎందుకు!' అంటూ ఘాటుగా విమర్శించారు. ఆ విమర్శలకు పవన్ కౌశిక్ ఇలా స్పందించాడు.. 'నేను చేసింది చాలా చిన్న పని అనే విషయం, ఆ సహాయం వల్ల అమ్మాజీ జీవితం మారదనే విషయం నాకు తెలుసు. అయితే ఈ పని నాకు ఎంతో సంతోషం ఇచ్చింది. ఆ సంతోషాన్ని ఇతరులతో పంచుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది'

అయ్ బామ్మోయి!

సంప్రదాయ దుస్తుల్లో బామ్మలు వీధుల్లో స్కేట్‌బోర్డింగ్ చేస్తున్న చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఇది నిజం కాదు. బామ్మలు నిజమే. స్కేట్‌బోర్డింగ్ మాత్రం ఏఐ సృష్టి!



ఆశిష్ జోస్ అనే ఆర్టిస్ట్ ప్రాంప్ట్-బేస్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామ్ 'మిడ్‌జర్నీ'ని ఉపయోగించి ఈ చిత్రాలను సృష్టించాడు.

'స్కేటింగ్ నానీ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే మూడు రోజుల వ్యవధిలోనే 1.17 లక్షల వ్యూస్ వచ్చాయి. 'సాహసానికి వయసు అడ్డు కాదు'లాంటి ఎన్నో కామెంట్స్ కనిపించాయి.

జై శ్రీ అన్నా

గతంతో పోల్చితే చిరుధాన్యాల పెద్ద ఉపయోగాల గురించి పల్లె, పట్టణం అనే తేడా లేకుండా విస్తృత అవగాహన పెరిగింది. దీనికి సాక్ష్యంగా నిలిచే వీడియోను ప్రధానమంత్రి నరేంద్రమోదీ షేర్ చేశారు.



'వైబ్రెంట్ విలేజెస్' కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఒక గ్రామంలోకి వెళ్లారు.

ఆ గ్రామంలోని ఒక మహిళ మంత్రిగారికి చిరుధాన్యాలతో చేసిన సంప్రదాయ వంటల రుచి చూపించడమే కాదు... జొన్నె రొట్టె నుంచి రాగి లడ్డు వరకు చిరుధాన్యాలు చేసే మంచి గురించి మంచిగా మాట్లాడింది. ప్రధాని ప్రశంస అందుకొంది.

'ప్రతి పల్లెలో ఇలాంటి దృశ్యం కనిపించాలి'... 'క్షేత్రస్థాయి నుంచి మొదలైన స్పృహ, చైతన్యం వేగంగా విస్తరిస్తుంది'... 'కనుల విందు చేసే వీడియో'... ఇలాంటి కామెంట్స్ కనిపించాయి.

స్వీట్‌వాయిస్ చిట్టెమ్మ!

పియానో వాయిస్తూ ఒక మహిళతో కలిసి కన్నడ పాట పాడుతున్న చిన్నారి వీడియో సోషల్ మీడియాలో వీర లెవల్లో వైరల్ అయింది. అనంత్ కుమార్ అనే యూజర్ ఈ వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేశాడు. పాడుతున్న సమయంలో చిన్నారి ప్రదర్శించిన హావభావాలకు నెటిజనులు ఫిదా అయ్యారు. 'ఆహా' అంటూ అబ్బురపడ్డారు.



'పక్కనే తీయటి సెలయేరు పారుతున్నట్లుగా ఉంది' 'మ్యాజిక్ వాయిస్ ప్లస్ బ్యూటీఫుల్ ఎక్స్‌ప్రెషన్స్' లాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

నిజానికి ఆన్‌లైన్ ప్రేక్షకులకు ఈ చిన్నారి గొంతు కొత్తేమీ కాదు. గత సంవత్సరం బాలీవుడ్ సినిమా 'కబీర్‌సింగ్' సినిమాలోని 'కైసే హువా' పాటను అద్భుతంగా పాడింది. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది.

పల్లో లట్కే

డ్యాన్సింగ్ వీడియోలు సోషల్ మీడియాలో పాపులర్ కావడం అనేది కొత్త విషయమేమీ కాదు. అయితే అమ్మాయిల బృందం చేసిన ఈ డ్యాన్స్ వీడియో వారం రోజుల వ్యవధిలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 1.1 మిలియన్ వ్యూలను సొంతం చేసుకుంది. 'అసలు కంటే కాపీ ముద్దు' అనే సామెత లేదు గానీ ఈ వీడియో క్లిప్ చూస్తే అలాగే అనిపిస్తుంది.

'షాదీ మే జరూరు ఆనా' అనే హిందీ సినిమాలోని 'పల్లో లట్కే' సాంగ్‌కు ఈ యువబృందం వేసిన స్టెప్పులు 'ఆహా' అనిపించాయి.



'ఏబీసీడీ డ్యాన్స్ ఫ్యాక్టరీ' ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'అప్పుడెప్పుడో పెళ్లిసంబరాల్లో డ్యాన్స్ చేసేదాన్ని. ఈ వీడియో చూస్తుంటే...నా మొఖాల నొప్పులను పక్కనపెట్టి డ్యాన్స్ చేయాలని ఉంది' అని కామెంట్ పెట్టింది 69 సంవత్సరాల రాధాబాయి.

వీడియో తెగ వైరల్ అయిందని చెప్పడానికి ఇంతకు మించిన కామెంట్ అక్కర్లేదేమో!

పాటల తుపాకీ...

దేశ సరిహద్దులో బీఎస్ఎఫ్ జవాన్. వేదికల మీద పాటలు పాడుతూ తనలో ఉన్న కళకు హద్దులు లేవని నిరూపిస్తున్నారు. 'డ్యూటీలో ఉంటూ గాన సాధన కూడా చేయడంతో ఈ పాట నాకు బాగా వంట పట్టింది' అంటూ ఇటీవల హైదరాబాద్ వచ్చిన చక్రపాణి నగరి తన గురించి వివరించారు.



చక్రపాణి నగరి

"మాది శ్రీకాకుళం జిల్లా, పలాస. టెన్త్‌క్లాస్ వరకు హైదరాబాద్ హాస్టల్‌లో ఉండి చదువుకున్నాను. ఆ సమయంలో బీఎస్ఎఫ్‌కు సంబంధించిన ఒక ప్రకటన చూసి, అప్లై చేశాను. ఆ పరీక్షల్లో సెలక్ట్ అయ్యి 2013లో బీఎస్ఎఫ్‌లో చేరాను. ఇప్పటి వరకు రాజస్థాన్‌లో పని చేశాను. ఇప్పుడు సెలవు మీద హైదరాబాద్‌కు వచ్చాను. సెలవు పూర్తవగానే జమ్ములో విధులు నిర్వర్తించాలి.

డ్యూటీలో ఉంటూ..

ఏదో ఒకటి పాడుకుంటూ ఉండటం అనేది స్కూల్ టైమ్ నుంచే ఉండేది. కానీ, ఎప్పుడూ దానిని నా డ్రీమ్ ప్రాజెక్ట్ అనుకోలేదు. బీఎస్ఎఫ్‌లో చేరిన తర్వాత అక్కడ మా టీమ్, క్యాంపుల్లో సరదాగా పాడుతుండేవాడిని. నెలకు ఒకసారి ఏదో ఒక సెలబ్రేషన్ ప్రోగ్రామ్ జరుగుతుంటుంది. ఆ సమయంలో అన్నీ హిందీ పాటలు పాడేవాడిని. అక్కడున్నవారందరికీ హిందీ తెలుసు కాబట్టి, అవే పాటలు పాడేవాడిని. మా తోటి జవాన్‌లే కాదు ఆఫీసర్స్ కూడా చాలా ప్రోత్సహించేవారు. డ్యూటీలో ఉన్నా లేకున్నా పాటలు పాడటం మాత్రం ఆగేది కాదు. ఇక మా ఊరికి వచ్చినప్పుడు పెళ్లిళ్లు వంటి వేడుకల సందర్భాల్లోనూ నా గాన కచేరీ ఉండేది. ఖాళీ సమయంలో డిజిటల్ మీడియాని ఫాలో అవుతుంటాను. అలా, హైదరాబాద్‌లోని ఓ టీవీ పాటల కార్యక్రమంలో పాల్గొనవచ్చు అని ప్రకటన చూసి, అప్లై చేసుకున్నాను. వేల మందిలో నాకు అవకాశం రావడంతో చాలా సంతోషంగా అనిపించింది. ఈ విషయాన్ని మా అధికారులకు చెబితే వాళ్లు వెంటనే ఓకే చేశారు. ఇక్కడ కార్యక్రమంలో పాల్గొనడమే కాదు, గాన గంధర్వుడు బాలుగారి మైక్‌ను కానుకగా అందుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది.


కష్టపడుతూ..

మా అమ్మానాన్నలకు మేం ముగ్గురం. నా చిన్నప్పుడే నాన్న చనిపోవడంతో మా అమ్మ చాలా కష్టాలు పడింది. మమ్మల్ని హాస్టల్‌లో ఉంచి, తెలిసినవారి ద్వారా ఢిల్లీ వెళ్లి, పనులు చేసి, మాకు డబ్బు పంపేది. ఇప్పుడు అమ్మ ఊళ్లో వ్యవసాయం పనులు చేస్తుంది. అన్నయ్య సొంతగా బేకరీ నడిపిస్తున్నాడు. అక్క గ్రామవాలంటీర్‌గా చేస్తోంది. మాకు కష్టం విలువ తెలుసు, స్వయంగా ఎదగడానికి మా వంతుగా కృషి చేస్తూనే వచ్చాం. ఆ కష్టంలో నుంచే ఈ పాట పుట్టుకు వచ్చిందనుకుంటాను. ఎక్కడ ఉన్నా కళ రాణిస్తుందనడానికి నేనే ఉదాహరణ అనిపిస్తుంటుంది. మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొని సింగర్‌గా రాణించాలనుకుంటున్నాను'' అని తెలియజేశాడు ఈ జవాన్.

– నిర్మలారెడ్డి

హెల్త్

బోన్ మ్యారో ఫెయిల్యూర్?



నిజానికి మూలుగ వైఫల్యం కూడా ఓ ఆటో ఇమ్యూన్ డిసీజ్. అంటే మన సొంత రోగనిరోధక శక్తి మన సొంత కణాలపై ప్రతికూలంగా ఏర్పడటం వల్ల వచ్చే వ్యాధి. దాంతో మూలుగ ప్రభావితమై, రక్తంలోని కణాల పుట్టుక, ఆరోగ్యకరమైన పెరుగుదల దెబ్బతింటుంది. ఫలితంగా ఎర్ర, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్ల కౌంట్ నార్మల్‌గా ఉండక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. 'అప్లాస్టిక్ అనిమియా' కండిషన్ ఏ వయసువారిలోనైనా, ఎప్పుడైనా రావచ్చు. సాధారణంగా చిన్న పిల్లల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఆసియావాసుల్లో అందునా మన దేశంలోనే ఈ కేసులు ఎక్కువ. దాదాపు 75 శాతం కేసుల్లో కారణాలు తెలియదు. అయితే మిగతా 25% కేసుల్లో ఈ కింది అంశాలు కారణం కావచ్చు.

తెల్లరక్తకణాలు తగ్గడం వల్ల...

ఈ కండిషన్‌ను 'న్యూట్రోపీనియా' అంటారు. తెల్లరక్తకణాలు మన లోని వ్యాధినిరోధక శక్తికి తోడ్పడి ఇన్ఫెక్షన్లతో పోరాడతాయి. వాటి సంఖ్య తగ్గడం వల్ల తేలిగ్గా ఇన్ఫెక్షన్ల బారిన పడటం, తరచూ జ్వరం రావడం వంటి పరిణామాలు ఏర్పడతాయి. ముఖ్యంగా మూత్రకోశం (బ్లాడర్) ఇన్ఫెక్షన్లకు గురి కావడం, మూత్రంలో మంట, మూత్రవిసర్జనలో నొప్పి, తరచూ ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో కష్టం, నోటిలో పుండ్లు, సైనస్ సమస్య, ముక్కు దిబ్బడ, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు కనిపిస్తుంటాయి. అప్లాస్టిక్ అనిమియా ఉన్నవారిలో జ్వరం చాలా తీవ్రమైన సమస్యగా పరిణమించవచ్చు. చికిత్స చేయకపోతే ప్రాణాపాయం కావచ్చు.

ప్లేట్‌లెట్స్ తగ్గడం వల్ల... : ఏదైనా గాయం అయినప్పుడు రక్తస్రావాన్ని నిరోధించడానికి రక్తం గడ్డకట్టే ప్రక్రియకు ప్లేట్‌లెట్స్ తోడ్పడతాయన్న విషయం తెలిసిందే. అందుకే ఇవి లోపించినప్పుడు రక్తస్రావం ముప్పు ఏర్పడుతుంది. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గే కండిషన్‌ను 'థ్రాంబోసైటోపీనియా' అంటారు. దీనివల్ల చిన్న చిన్న గాయాలకే తీవ్రమైన రక్తస్రావం, ముక్కు నుంచి రక్తస్రావం, చర్మం కింది పొర లో రక్తపు చుక్కల్లా ఎర్రమచ్చల్లాంటివి కనిపించడం, బ్రష్ చేసుకుంటున్నప్పుడు చిగుర్లు ఏమాత్రం దెబ్బతిన్నా తేలిగ్గా రక్తం వస్తుండటం, ఇక మహిళల్లోనైతే పీరియడ్స్ సమయంలో విపరీతమైన రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయినప్పుడు అంతర్గత రక్తస్రావం కూడా కనిపించవచ్చు. ఈ కేసులో రక్తస్రావం కూడా ఓ మెడికల్ ఎమర్జెన్సీగా పరిగణించాలి. బయట రక్తస్రావం అవుతుంటే హాస్పిటల్‌కు చేరేవరకు రక్తస్రావాన్ని ఆపడానికి ప్రయత్నించాలి.

కారణాలు : ● క్రిమిసంహారక మందులకు, ఆర్సినిక్, బెంజీన్ వంటి విషపదార్థాలకు గురికావడం ● కొన్ని సందర్భాల్లో రేడియేషన్, కీమోథెరపీతో కూడా రావచ్చు ● రుమటాయిడ్ ఆర్థరైటిస్ లేదా లూపస్ వంటి ఆటోఇమ్యూన్ జబ్బులకు తీసుకుంటున్న చికిత్సల వల్ల కూడా రావచ్చు ● హెపటైటిస్, కొన్ని ఇతర అరుదైన వైరస్‌లు ఎముక మజ్జ అణచివేతతో పాటు వైఫల్యానికి కారణం కావచ్చు ● హెపటైటిస్, ఎప్‌స్టెయిన్ బార్ వైరస్, సీఎంవీ వైరస్, పర్‌వైరస్ బి19 లేదా హెచ్‌ఐవీ వంటి సాంక్రమిక (ఇన్ఫెక్షియస్) వ్యాధుల తర్వాత కనిపించవచ్చు ● కొందరిలో వంశపారంపర్యంగా కూడా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు రావచ్చు. (ఇలా వంశపారంపర్యంగా ఈ జబ్బు వచ్చినప్పుడు మూలుగ మార్పిడి చికిత్స (బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్) ఒక్కటే తగిన చికిత్స) ● మైలోడిస్‌ప్లాస్టిక్ సిండ్రోమ్ : ఇది రక్తానికి చెందిన ఒక రకం క్యాన్సర్‌కు ముందు దశ. ఈ సమస్య రాబోయే కొందరిలో ఇది హైపోసెల్యులార్ బోన్ మ్యారో అనే కండిషన్ (అంటే రక్తంలో ఉండే కణాల సంఖ్య తగ్గుదల)తో కనిపించవచ్చు ● పరోక్సిస్మల్ నాక్టర్నల్ హీమోగ్లోబినూరియా (పీఎన్‌హెచ్) : మన మూలుగలో ఉండే కణాల్లోంచి తొలుత మూల కణాలు (స్టెమ్‌సెల్స్) పుడతాయి. అవి నిర్దుష్టంగా ఏయే కణాలు అంటే... ఎర్రరక్తకణాలు, తెల్లరక్తకణాలు, ప్లేట్‌లెట్లు ఏయే పరిమాణాలతో ఎంత ఉండాలో అన్నిగా మారిపోతుంటాయి. కానీ 'పైగా' (పీఐజీ-ఏ) అనే ఓ జీన్ మ్యుటేషన్ (జన్యు ఉత్పరివర్తనం) కారణంగా రక్తకణాల్లో ఉండాల్సిన ఓ ప్రొటీన్ లోపించడంతో ఎర్రరక్తకణాలు విరిగిపోయినట్లుగా అవుతాయి. ఈ పరిణామాలు జరిగినప్పుడు ఎముక మజ్జలోని మూలకణాలు కూడా నాశనం అవుతాయి.

లక్షణాలు : అప్లాస్టిక్ అనిమియాతో ఎర్రరక్తకణాల సంఖ్య బాగా తగ్గుతుంది. ఫలితంగా ఈ కింది పరిణామాలు సంభవిస్తుంటాయి... ● ఎప్పుడూ నీరసం, నిస్సత్తువ ● చురుకుదనం లోపించడం, దేని పైనా దృష్టి కేంద్రీకరించలేకపోవడం ● ఆకలి తగ్గడం, బరువు తగ్గడం ● బాగా పాలిపోయినట్లుగా ఉండటం ● చిన్న చిన్న పనులకూ తీవ్రంగా ఆయాసం, గుండె వేగం పెరగడం ● మెట్లు ఎక్కలేకపోవడం, చిన్నపాటి వ్యాయామాలకూ తీవ్రంగా ఆయాసం ● చిన్నపాటి గాయం అయినా, తీవ్రమైన రక్తస్రావం ● తరచూ ఇన్ఫెక్షన్లతో పాటు జ్వరం

నిర్ధారణ: సరైన చికిత్స కోసం సమస్య ను సరిగ్గా నిర్ధారణ చేయడం అవసరం. ఇందుకు కంప్లీట్ బ్లడ్ పిక్చర్ వంటి రొటీన్ బ్లడ్ వర్కప్స్, కిడ్నీ ఫంక్షన్ పరీక్ష, బోన్ మ్యారో పరీక్షలు తోడ్పడతాయి.

చికిత్స : – చాలా స్వల్పమైన లేదా ఓ మోస్తరుగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో వారికి ఎలాంటి సమస్యా లేకపోతే తక్షణం పెద్దగా చికిత్స ఏదీ అవసరం ఉండదు. కానీ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో మాత్రం మున్ముందు రాబోయే దుష్పరిణామాలను నివారించడం కోసం చికిత్స అవసరం. ఇలాంటివారికి తరచూ రక్తం ఎక్కిస్తుండటం (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్), జ్వరం, ఇన్ఫెక్షన్లు ఉన్నప్పుడు యాంటీబయాటిక్స్ ఇవ్వడం, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించేందుకు యాంటీ ఫంగల్ మందులు ఇవ్వడం అవసరం.

ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ : మన రోగనిరోధక వ్యవస్థ అతి చురుగ్గా మారి సొంత కణాలపై ప్రతికూలంగా పనిచేస్తున్నందున ఈ సమస్య వస్తుంది కాబట్టి... ఆ ఇమ్యూనిటీ చురుకుదనాన్ని తగ్గించే ఏటీజీ, సైక్లోస్పోరిన్ వంటి వాటిని ఉపయోగించి కూడా ఈ సమస్యకు చికిత్స అందిస్తారు.

స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్ : ఈ చికిత్సలో అనారోగ్యకరమైన / సమస్యాత్మకమైన మూలుగ స్థానంలో ఇతరుల నుంచి (తమకు సరిపడే విధంగా / మ్యాచ్ అయ్యే విధంగా) ఉన్న ఆరోగ్యకరమైన దాత రక్తం నుంచి సేకరించిన మూలకణాలు మార్పిడి చేస్తారు. ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ లేదా ఇతరత్రా చికిత్సలు పనిచేయనప్పుడు, ఇదే మంచి ప్రత్యామ్నాయం. అయితే ఇందుకు దాత నుంచి సేకరించే మూల కణాలు జన్యుపరంగా స్వీకర్తతో సరిపోలాల్సి ఉంటుంది. అందుకే కుటుంబ సభ్యుల నుంచి సేకరించే మూలకణాలకు మొదటి ప్రాధాన్యం. ఇతరుల నుంచి సేకరించినప్పుడు అందులోని చాలా అంశాలు మ్యాచ్ కావాల్సి ఉంటుంది. అయితే ఇదొక సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందుకోసం హాస్పిటల్‌లో నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స అవసరమవుతుంది. చికిత్స సమయంలో ఇన్ఫెక్షన్లు, ఇతరత్రా చాలా సమస్యలు వచ్చే అవకాశం ఉండటంతో ఈ సైడ్‌ఎఫెక్ట్స్ గురించి స్టెమ్‌సెల్ మార్పిడి నిపుణులతో చర్చించాకే ఈ చికిత్సకు వెళ్లాల్సి ఉంటుంది.

సరికొత్త చికిత్స ప్రక్రియలు : పైన పేర్కొన్న చికిత్సలే కాకుండా ఇప్పుడు మరింత అత్యాధునికమైన 'ఎల్ట్రాంబోప్యాగ్', 'రోమిప్లాటిజమ్' వంటి నూతన చికిత్సలూ– అందుబాటులోకి వచ్చాయి. మూలుగ మార్పిడి చికిత్సకు అంత అనుకూలం కాని వారిలోనూ, ఇమ్యునోసప్రెసివ్ చికిత్సలకు అంతగా స్పందించని వారిలోనూ ఇవి మంచి ఫలితాలను తెస్తున్నాయి.



డా॥ గూడల స్థితప్రజ్ఞ
కన్సల్టెంట్ క్లినికల్ హెమటాలజీ & హెమటో ఆంకాలజీ అండ్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్

మెడి టిప్

ఆహారంలో మార్పులతోనే నోటి దుర్వాసనకు అడ్డుకట్ట!

నోటి దుర్వాసనను వైద్యపరిభాషలో హాలిటోసిస్ అంటారు. మధుమేహం, గ్యాస్ట్రో ఇంటస్టినల్ జబ్బుల్లా అండర్‌లైయింగ్ డిసీజెస్ ఏవీ లేనప్పుడు కేవలం కొన్ని ఆహారాలు, ఆహారాల్లో మార్పులతో నోటి దుర్వాసన తగ్గించుకోవచ్చు. అదెలాగో చూద్దాం.

మన ఆహారంలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సమృద్ధిగా తీసుకోవడం, ద్రవపదార్థాలు ఎక్కువగా తాగడం వల్ల నోటి దుర్వాసనను అదుపు చేసుకోవచ్చు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లోని పీచు పదార్థాలు గ్యాస్ట్రో ఇంటస్టినల్ మార్గాన్ని ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంచుతాయి. ముఖ్యంగా ఆపిల్స్, క్యారట్స్ వంటి పీచు పదార్థాలు సమృద్ధిగా ఉన్న పండ్లు, కూరగాయలు నమిలి తినే ప్రక్రియలో అవి పళ్లను శుభ్రం చేస్తాయి. వీటిని తినడం వల్ల లాలాజలం ఎక్కువగా విడుదలై నోటిని శుభ్రంగా ఉంచుతుంది. తాజా పెరుగు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల నోటి దుర్వాసనకు కారణమైన హైడ్రోజెన్ సల్ఫైడ్ అదుపులోకి వస్తుంది. చిగుళ్ల వ్యాధులూ తగ్గుతాయి.

మరికొన్ని చిట్కాలు... నోటి దుర్వాసనను అరికట్టడంలో కొత్తిమీర, పుదీనా, యాలక్కాయ వంటివి బాగా పని చేస్తాయి. ఆహారంతోపాటు లేదా నేరుగా వాడటం వల్ల కూడా నోటి దుర్వాసన తగ్గుతుంది. వాటిని నీటిలో మరిగించి ఆ టీని తాగడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. దాంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. పాటించాక కూడా తగ్గకపోతే దంతాలు, చిగుర్లకు సంబంధించిన సమస్యగానీ, డయాబెటిస్ వంటి వ్యాధులు ఏమైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

బ్లడ్ గ్రూపులు కలవకపోయినా కిడ్నీ మార్పిడి సాధ్యమే!


మూత్రపిండాలు నూరు శాతం పాడైపోయినప్పుడు కిడ్నీ మార్పిడి తప్ప మరొక ప్రత్యామ్నాయం ఉండదు. అయితే ఒక మూత్రపిండం ఉన్నప్పటికీ జీవితాంతం ఆరోగ్యంగానే బతకవచ్చు. కాబట్టి ప్రభుత్వాలు నిర్దేశించిన మేరకు దగ్గరి బంధువులైన కొందరి నుంచి కిడ్నీ స్వీకరించడానికి అనుమతి ఉంటుంది.

కిడ్నీని రెండు రకాలుగా స్వీకరించడం సాధ్యమవుతుంది. మొదటివి లైవ్ డోనార్ నుంచి. అంటే బతికి ఉన్న దగ్గరి బంధువుల నుంచి సేకరిస్తారు. ఇక రెండోది కెడేవర్ డోనార్... అంటే ఏదైనా ప్రమాదానికి గురైనవారి దేహం బతికి ఉండి, మెదడు చనిపోయిన వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించినప్పుడు ఆ దాతను 'కెడేవర్ డోనార్'గా చెబుతారు. లైవ్ డోనార్స్ విషయంలో రక్తసంబంధీకులు మాత్రమే కిడ్నీని స్వీకరించే సమయంలో రక్తపరీక్షలు చేస్తారు. అయితే ఎంత దగ్గరి బంధువులైనప్పటికీ దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలిసినప్పుడే (మ్యాచ్) అయినప్పుడే కిడ్నీ ఇవ్వడం, తీసుకోవడం సాధ్యమవుతుంది. అంతేకాదు... కిడ్నీ దానం చేసేవారికి హైబీపీ, మధుమేహం (డయాబెటిస్), గుండెజబ్బులు, మెదడుకు సంబంధించిన జబ్బులు, కాలేయవ్యాధులైన హెపటైటిస్-బి, సి ఉండకూడదు. తన కిడ్నీ దానం చేసినప్పటికీ దాతకు ఎలాంటి నష్టం ఉండదని నిర్ధారణ చేశాకే కిడ్నీ మార్పిడి చేస్తారు.

అయితే రక్తసంబంధీకుల బ్లడ్ గ్రూపులు కలవకపోతే రెండు మార్గాలు ఉన్నాయి. ఇప్పుడు వైద్యశాస్త్రంలో వచ్చిన ఆధునిక పురోగతి వల్ల బ్లడ్ గ్రూపులు కలవకపోయినప్పటికీ కిడ్నీ ఇవ్వవచ్చు. ఇది రెండు రకాలుగా జరుగుతుంది.

మొదటిది... స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, రెండోది ఏబీఓ ఇన్ కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్.

స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్: ఇందులో రక్త సంబంధీకులకు కిడ్నీ దానం చేయాలని ఉన్నప్పటికీ... దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలవకపోవడం వల్ల అది సాధ్యపడనప్పుడు... అదే సమస్యతో బాధపడుతున్న వేరొకరి రక్త సంబంధీకులలో బ్లడ్ గ్రూపు సరిపడితే... వారి నుంచి కిడ్నీ స్వీకరించవచ్చు. ఇలా స్వీకరించినవారి రక్తసంబంధీకులు మళ్లీ వారికి తమ బంధువుల నుంచి కిడ్నీ ఇవ్వాల్సి ఉంటుంది. అంటే... రక్తసంబంధీకులే కిడ్నీ ఇస్తారు గానీ... కేవలం బ్లడ్‌గ్రూపులు కలవకపోవడం చేత... ఇరువర్గాలు వారు ఎదుటివారికి కిడ్నీ ఇచ్చి పుచ్చుకుంటారు. ఈ విధానంలో వీరి కిడ్నీని వారి బంధువుకూ, వారి కిడ్నీని వీరి బంధువుకు అమర్చే ఏర్పాటు చేస్తారన్న మాట. అంటే తమ బంధువుకు సరిపడని గ్రూపు ఎదుటివారికి సరిపడనప్పుడు ఇలా చేస్తారు. ఈ ప్రక్రియలో బాధితులిద్దరి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స ఒకేసారి జరుగుతుంది. ఈ ప్రక్రియను 'స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు.



ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్: బ్లడ్ గ్రూపులు కలవనప్పటికీ ఇప్పుడున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిడ్నీ మార్పిడి చేయడం వీలవుతుంది. అయితే ఈ ప్రక్రియ కోసం కొన్ని నిర్దుష్టమైన పద్ధతులూ, కొన్ని ప్రత్యేకమైన మందుల్ని ఉపయోగించాల్సి ఉంటుంది. ఇలా బ్లడ్‌గ్రూపు సరిపడకపోయినప్పటికీ జరిగే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్ని 'ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు. దీనిమీద ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే ఎలాంటి కిడ్నీ మార్పిడి అయినప్పటికీ... అది ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు, సూచనలకు అనుగుణంగానే జరగాల్సి ఉంటుంది.